చిన్న జీవి.. పెద్ద ముప్పు..!

ఈ భూమిపై నిరంతరం సంచరించే
అత్యంత శక్తివంతమైన జీవి ఏదో తెలుసా..?

అగ్ర రాజ్యాధిపతులకూ, అత్యంత శక్తివంతులకూ
నిద్ర లేకుండా చేయగల జీవి ఏదో తెలుసా..?

'అంతరిక్షానికి చేరుకున్నాం.. చందమామను ముద్దాడాం..'
అంటూ, విర్రవీగే మనందరినీ వణికించే జీవి ఏదో తెలుసా..?

పిల్లలూ-పెద్దలూ, పేదోళ్లూ-గొప్పోళ్లూ.. అనే తేడా లేకుండా
మానవ జాతిని 'సమంగా' చూసే జీవి ఏదో తెలుసా..?

తనకు పుట్టుకను ఇచ్చారన్న కృతజ్ఞత ఏమాత్రం లేకుండా..
సృష్టికర్తలైన మనుషుల్ని వెంటాడే, వేటాడే జీవి ఏదో తెలుసా..??

దోమ..!

మన నిర్లక్ష్యం నుంచి పుట్టికొచ్చిన జీవి ఇది.
'ఉఫ్'మని ఊదితే కొట్టుకుపోయే సూక్ష్మ జీవి ఇది.
'టప్'మని కొడితే చచ్చి పడిపోయే ప్రమాదకర జీవి ఇది.

మనం నీళ్లు నిల్వ చేస్తే.. మనం చెత్తాచెదారాన్ని పడేస్తే..
మురుగును పట్టించుకోకుండా వదిలేస్తే.. అందులోంచి పుట్టుకొచ్చిన జీవి ఇది..!

జన్మనిచ్చారన్న కనికరం కూడా లేకుండా.. మనందరికీ నిద్ర లేని రాత్రుళ్లు మిగిల్చి..
మనల్నీ, మనవాళ్లనీ కుట్టి కుట్టి.. మన రక్తాన్ని జుర్రుకుని తాగి..
టైఫాయిడ్, మలేరియా, చిగున్‌గున్యా, డెంగ్యూ జ్వరాలను అంటించి,
మంచాన పడేసి.. నరకం చూపించి.. ప్రాణాలు తీస్తుంది..
ఈ మాయదారి దోమ..!!

దీని నుంచి మనల్ని, మనవాళ్లని కాపాడుకోవాలనుకుంటే..
ఈ జీవిని పుట్టనివ్వొద్దు.. ఈ జీవిని కుట్టనివ్వొద్దు..
ఈ జీవిని తరిమేయాలి.. ఈ జీవిని చంపేయాలి..

ఇది.. మనందరి నినాదం కావాలి..!
ఇది.. మనందరి కర్తవ్యం కావాలి..!!
ఇది.. మనందరి కార్యాచరణ కావాలి..!!

ఈ లక్ష్యంతోనే జిల్లా వైద్యారోగ్య శాఖ 'ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని' శుక్రవారం నిర్వహించింది. దోమల పుట్టుక-నివారణపై జిల్లావ్యాప్తంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అవగాహన సదస్సులు, ప్రదర్శనలు, మానవహారాలు తదితర రూపాల్లో కార్యాచరణ చేపట్టింది. -'నమస్తే' నెట్‌వర్క్, ఏప్రిల్ 25:

పర్ణశాల: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఇల్లెందు రూరల్: రొంపేడులో ర్యాలీ

టేకులపల్లి: అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి: వైద్య సిబ్బంది ర్యాలీ

ఇల్లెందు రూరల్: కొమరారంలో ర్యాలీ

ఇల్లెందు: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, పాల్వంచ: మానవహారం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కొత్తగూడెం అర్బన్: మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

రామవరం: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న చిన్నారులు

కరకగూడెం: నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఉగ్రవాదులపై ఉగ్రరూపం

ఉన్మాదులకు విచక్షణ ఉండదు.. ఉన్మత్తత తప్ప..
ఉగ్రవాదులకు మతం ఉండదు.. మతోన్మాదం తప్ప..

ఉన్మాదులకు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మానవతావాదులంతా ఒక్కటయ్యారు. 'మేమంతా భారతీయులం. మానవత్వమే మా మతం..' అంటూ, మతాలకతీతంగా అందరూ ఒక్కటయ్యారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రోన్మాదులు సాగించిన మారణకాండను ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజ్ పాటించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిపాలన, వైదిక సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రదాడులను నిరసిస్తూ అశ్వారావుపేట పట్టణ-మండలవ్యాప్తంగా శనివారం బంద్ పాటించాలని వ్యాపారాలకు చాంబర్ ఆఫ్ కామర్స్ పిలుపునిచ్చింది. బూర్గంపహాడ్ మండలం సారపాకలో ఉగ్రవాదం దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి, దానిని ప్రధాన సెంటర్‌లో దహనం చేశారు.
-'నమస్తే' నెట్‌వర్క్, ఏప్రిల్ 25:

పాల్వంచ: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

దమ్మపేట: శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముస్లింలు

భద్రాచలం: రామాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న అర్చకులు, బూర్గంపహాడ్: సారపాకలో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు, రామవరం: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

మంచినీరు మహాప్రభో..!

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కుతున్న మహిళలు, గ్రామస్తులు
- పలు గ్రామాల్లో వెల్లువెత్తుతున్న నిరసనలు
- తాగునీరు సరఫరా చేయలని వేడుకుంటున్న వైనం
- మోటరు కాలిపోవడంతో కాటాయిగూడెంలో నీరు బంద్
- పంప్ ఆపరేటర్ లేక మాయాబజార్ వాసుల అవస్థ
- నెహ్రూనగర్‌లో సగం గ్రామానికే నీటి సరఫరా
- ప్రజల విన్నపాలను ఏమాత్రం పట్టించుకోని అధికారులు

దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెంలో తాగునీరు రావడంలేదని నిరసన తెలుపుతున్న మహిళలు

చుంచుపల్లి మండలం ధన్బాద్ పంచాయతీలోని మాయాబజార్ గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం/ చుంచుపల్లి/ ఇల్లెందురూరల్, ఏప్రిల్ 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక గ్రామాల్లో మంచినీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవికాలంలో తాగునీరు అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీళ్లు అందించండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నారు. ప్రతిరోజూ పలు గ్రామాల్లో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. శుక్రవారం సైతం దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెం, చుంచుపల్లి మండలం మాయాబజార్, ఇల్లెందు మండలం నెహ్రూనగర్ గ్రామాల్లో రోడ్డుపైకి వచ్చి మహిళలు, గ్రామస్తులు నిరసన తెలిపిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దుమ్ముగూడెం మండలం మహాదేవపురం పంచాయతీలోని కాటాయిగూడెం గ్రామస్తులు 20రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మంచినీరు అందించే మోటారు మరమ్మతులకు గురికావడంతో సరఫరా ఆగిపోయింది. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, మహిళలు మోటారు వద్ద ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది అక్కడకు చేరుకుని మోటారుకు మరమ్మతులు చేపట్టారు. నిరసన తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోడి చంటి, గ్రామస్తులు జలకం లచ్చమ్మ, కోడి నరసమ్మ, మంగమ్మ, సమ్మక్క, దుర్గ, రోజా, నాగరాజు, శ్రీరాములు, సర్వీస్‌రావు, వెంకటేష్ ఉన్నారు. చుంచుపల్లి మండలంలోని ధన్బాద్ పంచాయతీలో ఉన్న మాయాబజార్ గ్రామానికి ధన్బాద్‌లోని ట్యాంకు ద్వారా మంచినీరు సరఫరా అవుతోంది. అయితే ఇటీవల పంపు ఆపరేటర్ మృతిచెందడంతో ఎవరుపడితే వారు పంపు వాల్‌ను ఇష్టానుసారంగా విప్పి నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో మాయాబజార్ గ్రామానికి సరిపడా నీరు అందడం లేదు. పంప్ ఆపరేటర్‌ను నియమించి తమ గ్రామానికి నీరు అందించాలని అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో శుక్రవారం గ్రామస్తులు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు.

నెహ్రూనగర్‌లో తీవ్ర నీటిఎద్దడి..

ఇల్లెందు మండలం నెహ్రూనగర్ గ్రామంలో 20వేల లీటర్ల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుతో సగంమందికి మాత్రమే తాగునీరు సరఫరా అవుతున్నది. ఊరిలో సగం కుటుంబాలకే కనెక్షన్, పైపులు ఏర్పాటు చేయడంతో మిగతా సగంమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు కూడా పైప్‌లైన్ ఏర్పాటు చేసి కనెక్షన్‌ను ఇస్తే నీరు సరఫరా అవుతుందని చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగారు. ఎన్నోసార్లు విన్నపాలు, విజ్ఞప్తులు చేసుకున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా ఉంటున్నారు. వేసవిలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించకుంటే ప్రజాప్రతినిధులను తమ గ్రామంలోకి రాకుండా అడ్డుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతుల కోసమే 'భూభారతి'

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చండ్రుగొండ, ఏప్రిల్ 25 : భూ సమస్యలతో రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ స్పష్టం చేశారు. దామరచర్ల గ్రామంలో భూభారతి చట్టంపై రైతులకు శుక్రవారం నిర్వహించిన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. తొలుత అయ్యన్నపాలెం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మునగ తోటలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశాడు. అనంతరం సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంపై ఇకపై అన్ని గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల మెయింటెనెన్స్ ఉంటుందని, ప్రతీ రెవెన్యూ విలేజ్‌కు ఒక రెవెన్యూ అధికారిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. సాదాబైనామాలో చేసుకున్న దరఖాస్తులకు ఇప్పుడు పరిష్కారం దొరుకుతుందని, ఏజెన్సీ చట్టాలకు లోబడి గిరిజన, గిరిజనేతర రైతుల భూములకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏ ఒక్కరి హక్కులకు భంగం కలగకుండా భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. భూభారతి చట్టంపై పలువురి రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సమావేశంలో ఆర్డీవో మధు, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్ రావు, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో అశోక్, ఏవో వినయ్, రైతులు పాల్గొన్నారు.

నవభారత్ చోరీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

జిల్లాలో సంచలనం సృష్టించిన దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

మధ్యప్రదేశ్ దొంగల ముఠాగా గుర్తింపు.. 250 గ్రాముల ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్

పాల్వంచ, ఏప్రిల్ 25: పాల్వంచ నవభారత్ ఉద్యోగుల క్వార్టర్లలో చోరీలకు పాల్పడిన కేసులోని ప్రధాన నిందితుడిని పాల్వంచ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సతీశ్‌కుమార్ ఆ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పాల్వంచ నవభారత్ క్వార్టర్స్‌లో జనవరి 25న అర్ధరాత్రి సమయంలో భారీ చోరీ జరిగింది. ఘటనా స్థలంలో లభించిన శాస్త్రీయ ఆధారాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. తొమ్మిది ఇళ్లల్లో 900 గ్రాముల మేర బంగారు ఆభరణాలను, నగదును చోరీ చేశారు. ఎస్పీ రోహిత్‌రాజు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో అంతర్ రాష్ట్ర ముఠాను పట్టుకునేందుకు పాల్వంచ పట్టణ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ దొంగల ముఠాలోని ఓ సభ్యుడైన అనీల్‌సింఘార్‌ను గత నెలలో అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడైన మధ్యప్రదేశ్‌కు చెందిన పింటు భవార్‌ను, మరో సభ్యుడైన శోభన్ సింగ్ సోలంకిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ విచారించగా వారి వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి. సీఐ సతీశ్, ఎస్సైలు రాఘవయ్య, సుమన్, ప్రవీణ్ పాల్గొన్నారు. కాగా, ఈ కేసులో ఉన్న మిగిలిన నిందితులను కూడా పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నవ వధువు 'బలవ'న్మరణం

టేకులపల్లి, ఏప్రిల్ 25: పెద్దలను ఎదిరించి ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఆమె జీవితం విషాదాంతమైంది. ఆమె తన ప్రాణాన్ని తానే 'బలవంతం'గా బలి తీసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. టేకులపల్లి మండలం దాస్‌తండా పంచాయతీ రేగులతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ వత్మల్ కుమార్తె ఇస్లావత్ దీపిక(19), బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా గ్రామానికి చెందిన బోడ వీరు-చిలికి దంపతుల కుమారుడైన బోడ శ్రీను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భవతి. దీపికను భర్త బోడ శ్రీను, అత్త బోడ చిలికి, మామ బోడ వీరు, వారి కుటుంబ సభ్యుడైన బోడ వెంకన్న, ఆడబిడ్డలు ఫారు, సునీత, భూక్యా శ్రీను కలిసి.. కట్నం తేవాలంటూ రెండు నెలలుగా వేధిస్తున్నారు. 24వ తేదీ మధ్యాహ్నం కూడా వారంతా కలిసి దీపికతో గొడవపడి తిట్టారు, కొట్టారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటల సమయంలో ''నీ భర్త.. కూల్ డ్రింక్ బాటిల్‌లో గడ్డి మందు, ఎలుకల మందు కలుపుకుని తాగాడు'' అని చెప్పి, ఆ బాటిల్ చూపించారు. ఇది నిజమేనని నమ్మిన దీపిక.. ఆ బాటిల్‌లోని ద్రవాన్ని తాగింది. కొద్దిసేపటికే అస్వస్థురాలైన ఆమెను ఆ కుటుంబ సభ్యులు ముందుగా స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆస్పత్రిలోనే మృతిచెందింది. దీపిక తండ్రి ఇస్లావత్ వత్మల్ ఫిర్యాదుతో ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇల్లెందు, ఏ ప్రిల్ 25: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి న వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఇల్లెందు పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను, సమస్యలను తెలుసుకున్నారు. రౌడీషీటర్ల కదలికలను పరిశీలించాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారితో కఠినంగా వ్యవహరించాలని, ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆదేశించారు. డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు సూర్యం, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి'

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషిచేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి కోరారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాది జిల్లా శాఖ ఉద్యమ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొత్త పాఠశాలల జోలికి వెళ్లకుండా ఉన్న పాఠశాలల్లో వసతి సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. సంఘం నాయకులు మురళీమోహన్, రాజు, ఎం.వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

బూర్గంపహాడ్, ఏప్రిల్ 25: మండలంలోని సారపాక పంచాయతీ కార్యాలయాన్ని ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించారు. పంచాయతీ ఈవో కంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఏప్రిల్ 25: ఈ నెల 20న ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. వీటిని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని నారంవారిగూడెం కాలనీ పంచాయతీలోని ఇందిరమ్మ ఇండ్లను జడ్పీ సీఈవో/నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాగలక్ష్మి పరిశీలించారు. అర్హులను మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామారావు, ఎంపీవో ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవం

అశ్వారావుపేట, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి స్థానిక చిన్నంశెట్టి బజార్‌లో కేక్ కట్ చేశారు. యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, చిన్నంశెట్టి వెంకట రామారావు, వాసు, ఈదర భీమయ్య, చిన్నంశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేట, ఏప్రిల్ 25: మండలంలోని పేరాయిగూడెం సమీపం నుంచి అశ్వారావుపేటకు మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేసి, తమ కార్యాలయానికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ తెలిపారు.

అశ్వారావుపేట సీఐగా నాగరాజు

అశ్వారావుపేట, ఏప్రిల్ 25: అశ్వారావుపేట సీఐగా పింగళి నాగరాజు శుక్రవారం విధుల్లో చేరారు. ఆయన కొత్తగూడెం సీసీఎస్-1 నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

జామా మసీద్ కమిటీ ఎన్నిక

అశ్వాపురం, ఏప్రిల్ 25: స్థానిక జామా మసీద్ నూతన కమిటీని శుక్రవారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవాధ్యక్షుడిగా షేక్ అలీఖురేషి, అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ శబ్బార్, ఉపాధ్యక్షుడిగా షేక్ సాదిక్‌పాషా, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబ్దుల్ మజీద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ బాజీబాబా, వెల్ఫేర్ సెక్రటరీగా షేక్ అబ్దుల్ వహీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ అన్వర్ జాని, కోశాధికారిగా షేక్ హుస్సేన్‌అలీ ఎన్నికయ్యారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, ఏప్రిల్ 25: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపచేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు.

సీఐటీయూ భద్రాచలం కమిటీ ఎన్నిక

భద్రాచలం, ఏప్రిల్ 25: సీఐటీయూ భద్రాచలం పట్టణ కమిటీని శుక్రవారం జరిగిన మహాసభ ఎన్నుకుంది. కన్వీనర్‌గా బండారు శరత్‌బాబు, సభ్యులుగా మరికొందరు ఎన్నికయ్యారు.

ఉచిత పశు వైద్య శిబిరం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 25: మండలంలోని తూరుబాక పంచాయతీ రామకృష్ణాపురంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని భద్రాచలం ఏఎంసీ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మ ప్రారంభించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆఫ్ టైప్ పామాయిల్ చెట్ల పరిశీలన

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని జగ్గారం గ్రామంలోగల పామాయిల్ తోటల్లో ఆఫ్ టైప్ చెట్లను ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆయిల్‌పాం పరిశోధనాస్థానం విశ్రాంత శాస్త్రవేత్త బీఎన్.రావ్ శుక్రవారం పరిశీలించారు. ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, అధికారులు ప్రవీణ్‌రెడ్డి, కళ్యాణం, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ మృతులకు ఎక్స్‌గ్రేషియా

మణుగూరు టౌన్, ఏప్రిల్ 25: వడదెబ్బ మృతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బతో మృతి చెందినట్లుగా మెడికల్ ఆఫీసర్ నుంచి, పోలీసుల నుంచి నివేదికలు సమర్పిస్తే మండల స్థాయి త్రీ మెన్ కమిటీ పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈ కమిటీ ఆమోదిస్తే రూ.4 లక్షల ఎక్స్‌గ్రేసియా అందుతుందని వివరించారు.

నేటి నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 25: సింగరేణి కుటుంబాల్లోని 18 సంవత్సరాలోపు పిల్లలకు ఈ నెల 26 నుంచి మే 20వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పర్సనల్ జీఎం కవితానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రకాశం స్టేడియంలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

గనులను సింగరేణికే కేటాయించాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 25: తెలంగాణలోని బొగ్గు గనులను వేలంతో సంబంధం లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరుతూ టీబీజీకేఎస్ నాయకులు శుక్రవారం మణుగూరు జీఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. జీఎం రాంచందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాగెల్లి వెంకటేశ్వర్లు, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, సేవ, ముకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ కార్మికుల ఆందోళన

మణుగూరు టౌన్, ఏప్రిల్ 25: తమకు బకాయి బిల్లులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బీటీపీఎస్ 14 టైర్ల టిప్పర్, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం సమ్మెకు దిగారు. మణుగూరు వద్ద లారీలు నిలిచిపోయాయి. బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడింది.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లెందు, ఏప్రిల్ 25: మేడే పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి శుక్రవారం స్థానిక చండ్ర కృష్ణమూర్తి భవనంలో ఆవిష్కరించారు. టీయుసీఐ ఇల్లెందు ఏరియా అధ్యక్షుడు పాయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసంలో అర్హులకు న్యాయం చేయండి'

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 25: నిజమైన బీసీలకు, అత్యంత వెనుకబడిన కులాల పేదలకు న్యాయం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ వైస్ సీఎండీ మల్లయ్య భట్టుని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదువుకొని సొంతకాళ్లపై నిలబడే యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థిక సాయం అందించాలని కోరారు.